ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కరీంనగర్
3 జిల్లా వార్తలు
బుధవారం 31 జూలై 2024






రెండో విడత రుణమాఫీ

- రైతుల ఖాతాలకు చేరిన డబ్బులు
- 18,510 మంది రైతులకు రూ. 173.33 కోట్ల మాఫీ
- రెండు విడతల్లో 54,196 మంది రైతులకు రూ. 367.97 కోట్ల లబ్ధి

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండో విడత రుణమాఫీని మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు లాంఛనంగా ప్రారంభించారు. వెంటనే రైతుల రుణ ఖాతాల్లో డబ్బు జమ అయ్యింది. లక్ష నుంచి లక్షన్నర రూపాయలలోపు ఉన్న పంట రుణాలను మాఫీ చేస్తూ అందుకు సంబంధించిన డబ్బును ఆయా రైతుల ఖాతాల్లో జమ చేశారు. రెండో విడతలో జిల్లాలోని 18,510 మంది రైతులకు చెందిన 173.33 కోట్ల రూపాయల రుణాలు మాఫీ అయ్యాయి. ఈనెల 18న మొదటి విడతలో 35,686 మంది రైతులకు చెందిన 194.64 కోట్ల రూపాయల రుణాలు మాఫీ అయ్యాయి. రుణ మాఫీ పథకం కింద ఇప్పటి వరకు జిల్లాలోని 54,196 మంది రైతులు 367.97 కోట్ల రూపాయలు లబ్ధిపొందారు.



రైతురుణమాఫీ చెక్కును రైతులకు అందజేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

● ఆగస్టు చివరిలోగా రూ. రెండు లక్షల మాఫీ

ముఖ్యమంత్రి విదేశీ పర్యటనకు వెళ్ళి వచ్చిన తర్వాత ఆగస్టు చివరిలోగా రెండు లక్షల లోపు పంట రుణాలన్నింటిని మాఫీ చేస్తామని ప్రకటించారు. వివిధ సాంకేతిక కారణాలతో మొదటి, రెండో విడతల్లో కూడా లక్షన్నర లోపు రుణాలు ఉన్నవారి ఖాతాల్లో మాఫీ డబ్బులు జమకాలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మార్గదర్శకాలు సరిగా లేక రేషన్‌కార్డు, ఆధారుకార్డు ఒకే కుటుంబానికి చెందిన వారికి ఎన్ని రుణాలున్నా రెండు లక్షలలోపు రుణాలు మాత్రమే మాఫీ చేయడం, తదితర కారణాలతో పలువురికి రుణమాఫీ వర్తించలేదని చెబుతున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

● జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు, రైతులతో కలిసి రుణమాఫీపై సంబరాలు నిర్వహించారు. వివిధ మండలాల్లో రైతు వేదికల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండో విడత రుణమాఫీ కార్యక్రమాన్ని ప్రారంభించడాన్ని వీడియో కాన్ఫరెన్సులో వీక్షించేందుకు ఏర్పాట్లు చేశారు. కరీంనగర్ మారుతీనగర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి, స్థానిక మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు కాంగ్రెస్ శ్రేణులు క్షీరాభిషేకం చేశారు. పలు చోట్ల సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు.

రైతుల సంక్షేమమే లక్ష్యంగా రుణమాఫీ

- కలెక్టర్ పమేలా సత్పతి

రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమమే లక్ష్యంగా రుణమాఫీ పథకాన్ని అమలు చేస్తున్నదని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెండో విడతలో లక్షన్నరలోపు రుణమాఫీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో మాట్లాడుతూ జిల్లాలో 18,510 మంది రైతుల ఖాతాల్లో 173.33 కోట్ల రుణమాఫీ జరిగిందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అత్యంత ప్రాధాన్యంతో చేపడుతున్నదని, రైతులు మళ్లీ పంట రుణాలు తీసుకుని సాగు చేపట్టి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమానికి హాజరైన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీని ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నదని, రైతును రాజుగా చేయడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నదని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ లాంఛన ప్రాయంగా రుణమాఫీకి సంబంధించిన డమ్మీ చెక్కును రైతులకు అందజేశారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ అజయ్‌యాదవ్, జిల్లా వ్యవసాయ అధికారి బత్తుల శ్రీనివాస్, లీడ్ బ్యాంకు మేనేజర్ ఆంజనేయులు, కేడీసీసీబీ సీఈవో సత్యనారాయణరావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ఉద్యమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు జె వెంకటేష్

భగత్‌నగర్, జూలై 30: జిల్లాలోని ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు జె వెంకటేష్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నగరంలోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో సీపీఎం జిల్లా విస్తృతస్థాయి సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలపై ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వివిధ రూపాల్లో ఉద్యమాలు నిర్వహించాలన్నారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కారమయ్యేంత వరకు పోరాటాలు నిర్వహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం మతోన్మాద రాజకీయాలు చేస్తున్నదన్నారు. గడిచిన లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, కార్యదర్శి వర్గ సభ్యుడువర్ణ వెంకట్‌రెడ్డి, గీట్ల ముకుందరెడ్డి, యు శ్రీనివాస్, ఎడ్లరమేష్, వెల్మారెడ్డి రాజిరెడ్డి, శీలం అశోక్, డి నరేష్, వడ్లరాజు, పుల్లెల మల్లయ్య, గజ్జల శ్రీకాంత్, బాసిర సంపత్‌రావు, రాయికంటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

చిన్నారులను ఆకట్టుకునేలా వాల్ పెయింటింగ్స్ ఉండాలి: కలెక్టర్



శాంతినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గోడలపై వేసిన చిత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

భగత్‌నగర్, జూలై 30: చిన్నారులను ఆకట్టుకునేలా అంగన్‌వాడీ కేంద్రాల్లో గోడలపై పెయింటింగ్స్ ఉండాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నా రు. మంగళవారం కొత్తపల్లి మండలంలోని చింతకుంట శాంతి నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మారిన సిలబస్ దృష్ట్యా ఆటపాటలు టీచింగ్, లెర్నింగ్ కాన్సెప్ట్‌తో వాల్ పెయింటింగ్స్ వేయించాలన్నారు. ఈ విషయంపై మహిళా శిశుసంక్షేమ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల రూపు రేఖలు మార్చాలని, ప్రత్యేకప్రణాళికతో ముందుకు సాగాలన్నారు.

మహిళా చైతన్యం కోసమే రాజకీయ శిక్షణ తరగతులు



సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

భగత్‌నగర్, జూలై 30: మహిళా చైతన్యం కోసమే రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించామని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. నగరంలోని ముకుందలాల్ మిశ్రాభవన్‌లో ఐద్వా రాష్ట్ర స్థాయిశిక్షణ తరగతుల ముగింపు సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఐదు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల విజయవంతానికి కృషి చేసిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు. మహిళలను చైతన్య పరుస్తు మహిళా సమస్యలపై అనేక కర్తవ్యాలను రూపొందించామని, వాటి అమలుకు ఐక్య పోరాటాలు కొనసాగిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతుందని బెల్ట్ షాపులు, డ్రగ్ మాఫియా, పోర్న్ వెబ్‌సైట్‌లు అరికట్టి దశల వారీగా మద్యపాన నిషేధాన్ని అమలు చేయాలన్నారు. నిత్యం మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై అన్ని మహిళా సంఘాలతో ఐక్య కూటమి ఏర్పాటు చేసి పోరాడుతామన్నారు. కరీంనగర్ మకుందలాల్ మిశ్రాభవన్‌లో మహిళా సమస్యలపై న్యాయ నిపుణులతో కౌన్సెలింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి నాగమణి, ఉపాధ్యక్షురాలు ద్యావ అన్నపూర్ణ, రోజారాణి, దేవేంద్ర, లావణ్య, సంధ్య, యమున, లక్ష్మి, రజిత పాల్గొన్నారు.

ప్రమాద రహిత డ్రైవర్లను ఆదర్శంగా తీసుకోవాలి



ఆర్టీసీ ప్రమాదరహిత వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న టౌన్ ఏసీపీ నరేందర్

భగత్‌నగర్, జూలై 30: ప్రమాద రహితంగా డ్రైవర్లను ఆదర్శంగా తీసుకుని డ్రైవర్లంతా విధులు నిర్వహిం చాలని కరీంనగర్‌టౌన్ ఏసీపీ జి నరేందర్ అన్నారు. మంగళవారం కరీంనగర్-2 డిపోలో ప్రమాద రహిత వారోత్సవాలు ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వివిధ రకాల ప్రయాణ మాధ్యమాలు ఉన్నప్పటికీ ఆర్టీసీ ప్రయాణ మం టేనే ప్రజలకు నమ్మకమన్నారు. అలాంటి నమ్మకాన్ని డ్రైవర్లు కొనసాగించాలన్నారు. డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వాడొద్దని, సెల్‌ఫోన్ వల్ల ఏకాగ్రత చెదిరి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. రీజనల్‌మేనేజర్ ఎన్‌స ుచరిత మాట్లాడుతున్న ప్రమాద రహిత డ్రైవర్లుగా ప్రభాకర్, అంజయ్య, అల్తాఫ్ హుస్సేన్ రీజియన్ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలిచారన్నారు. వీరితోపాటు, రీజియన్ వ్యాప్తంగా 11 డిపోల్లో ముగ్గురు చొప్పున ప్రమాద రహిత సర్వీసు చేసినందుకు సన్మానంతో పాటు, ప్రశంసా పత్రాలు అందించామన్నారు. కార్యక్రమంలో పట్టణ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కరీముల్లాఖాన్, డిప్యూటీ ఆర్‌ఎం ఎస్ భూపతిరెడ్డి, డీఎం విజయమాధురి, పర్సనల్ ఆఫీసర్ ఎం చంద్రయ్య, అకౌంట్స్ ఆఫీసర్ సిహెచ్ వెంకటేశ్వర్లు, బస్‌స్టేషన్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ జి సురేష్, సూపర్‌వైజర్లు తిరుపతి, విజయలక్ష్మి, నజీర్, వీరస్వామి పాల్గొన్నారు.

కరీంనగర్‌లో ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

● నంబర్‌ప్లేట్ లేని 55 వాహనాల స్వాధీనం



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ సీఐలు

కరీంనగర్ క్రైం, జూలై 30: నగరంలోని పలుచోట్ల మంగళవారం కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు ద్విచక్రవాహనాల తనిఖీ నిర్వహించారు. సరైన నెంబర్ ప్లేట్ లేని 55 ద్విచక్ర వాహనాలను ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. వాహనాల యజమానులు అప్పటికప్పుడు సరిగా కనిపించే నంబర్ ప్లేట్లను బిగించుకునేలా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐలు ఖరీముల్లాఖాన్, పర్శ రమేష్ మాట్లాడుతూ వాహనాలకు తప్పనిసరిగా బిగించుకోవాలన్నారు. నంబర్ ప్లేట్స్ లేని వాహనాలకు జరిమానా విధించడంతోపాటు, నంబర్ ప్లేట్ బిగించే వరకు వాహనాన్ని సీజ్ చేస్తామని తెలిపారు. వాహనదారులకు ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో సీఐలు కౌన్సెలింగ్ ఇచ్చారు.

బీసీ డిక్లరేషన్ అమలులో ప్రభుత్వం విఫలం



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులు

సుభాష్‌నగర్, జూలై 30: కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి నెట్టు శ్రీశైలం విమర్శించారు. మంగళవారం బీసీ సమస్యలు పరిష్కరించాలని, కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో బీసీ కుల గణన చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పిందన్నారు. విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లను 20 నుంచి 42 శాతానికి పెంచుతామని హామీ ఇచ్చి, అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందన్నారు. రిజర్వేషన్లను పెంచకుండానే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్దామని చూస్తోందన్నారు. బీసీ సమాజం ఈ విషయాన్ని గ్రహించి కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌ను పూర్తిగా అటకెక్కించిందన్నారు. బీసీలపై, కామారెడ్డి డిక్లరేషన్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. బీసీ సమస్యలు పరిష్కరించాలని బీజేపీ ఆధ్వర్యంలో కొద్ది రోజులుగా కార్యక్రమాలు చేపడుతుంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. ప్రధానంగా కాంగ్రెస్ ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌కు 50వేల కోట్లు అవసరమైతే 9,200 కోట్లు మాత్రమే కేటాయించిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచి స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీల ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఓబీసీ రాష్ట్ర కార్యదర్శి భోగ విజయభాస్కర్, జిల్లా కార్యదర్శి ఆకుల రాజేందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆడిచెర్ల రాజు, బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి తాళ్ళపల్లి శ్రీనివాస్‌గౌడ్, రాంగోపాల్‌రెడ్డి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

5 నుంచి బల్దియా కార్మికుల సమ్మె



కరీంనగర్ టౌన్, జూలై 30: నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 5 నుంచి విధులను బహిష్కరించి సమ్మె చేస్తామని ప్రకటించారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్మిక సంఘాలు బీఆర్టీయూ, సీఐటీయూ ఐక్య కార్యాచరణ కమిటీగా ఏర్పడి కార్మికుల సమస్యల సాధనకు సమ్మె చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్‌ని కలిసి సమ్మె నోటీసును ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెత్తసేకరణకు వినియోగిస్తున్న ట్రాక్టర్లు, స్వచ్ఛ ఆటోలు, స్వీపింగ్ వాహనాలు, డంపర్ ప్లేసర్లు, వ్యాన్ ఇతర వాహనాలకు రెండేళ్లుగా మరమ్మతు చేయడం లేదని, వాహనాలు పూర్తిగా చెడిపోయి వాటిని నడపడానికి డ్రైవర్లు చాలా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్మికులకు రెయిన్ కోట్స్, యాప్రాన్లు, అరియర్స్ ఇవ్వాలని, చనిపోయిన కార్మికుడి స్థానంలో వారి కుటుంబసభ్యులకు వయసుతో నిమిత్తం లేకుండా ఉద్యోగం కల్పించాలని కోరారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే ఆగస్టు 5 నుంచి విధులను బహిష్కరించి సమ్మెలోకి వెళ్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి, టీఎండబ్ల్యూతయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం రాజమల్లు, మున్సిపల్ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు పొన్నం లింగయ్య, నగర అధ్యక్షుడు గడ్డం సంపత్, టీఎండబ్ల్యూతయూ జిల్లా అధ్యక్షుడు అసోద రవీందర్, నాయకులు మాతంగి లక్ష్మణ్, దాసరి రాజమల్లయ్య, కవ్వంపల్లి రవి, మల్లేశం, సుకంరి లక్ష్మన్, దావు రమేశ్, సుంకరి రమేశ్, సుంచు హరీష్ పాల్గొన్నారు.

మద్యం దుకాణాల్లో చోరీ

సుల్తానాబాద్, జూలై 30: సుల్తానాబాద్ పట్టణంలోని మద్యం దుకాణాల్లో మంగళవారం దొంగతనాలు జరిగాయి. ఉదయం మద్యం షాపులను తెరువడంతో దొంగలు పడ్డట్టు గుర్తించారు. వెంటనే షాపుల యజమానులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సుల్తానాబాద్ పట్టణంలోని శాస్త్రినగర్‌లోని ఓ వైన్ షాపులో గాలికోసం ఉన్న చిన్న కిటికీని ఊడదీసి లోపలకు దొంగలు దూరారని పెద్దగా మద్యం చోరీ కాలేదని, నగదు డబ్బుల కోసం కౌంటర్లు చెక్ చేశారని కానీ వారికి ఏమీ నగదు దొరకలేదని యజమాని సంతోష్‌రావు తెలిపారు. అలాగే అక్కడే సమీపంలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో సైతం దొంగలు పైకప్పు రేకులు తీసి లోనికి వచ్చారని కౌంటర్‌లో ఉన్న చిల్లర దాదాపు రెండు వేల వరకు తీసుకువెళ్లారని నిర్వాహకులు నరేష్ తెలిపారు.

సుభాష్‌నగర్‌లో బైక్ చోరీ

సుల్తానాబాద్ పట్టణంలోని సుభాష్‌నగర్‌లో ఎవరూ లేని ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఇంట్లో దూరిన దొంగ ఇరవై వేల నగదు చోరీ చేశాడని దాంతో పాటు ఇంటి ఆవరణలో ఉంచిన ద్విచక్ర వాహనాన్ని సైతం ఎత్తుకెళ్లాడని బాధితుడు ఆరేపల్లి బాలరాజు తెలిపారు. తాము ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని గమనించి ఈ దొంగతనానికి పాల్పడ్డాడని తెలిపారు. ఈ చోరీ మొత్తం సీసీ కెమెరాలో రికార్డు అయి ఉంది.

జ్వరంతో బాలుడి మృతి

సుల్తానాబాద్, జూలై 30: మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న ఓ బాలుడు మంగళవారం మృతిచెందాడు. సుల్తానాబాద్ పట్టణంలోని గడీమహల్‌కు చెందిన సాదిక్-రెహనా దంపతుల పదకొండు నెలల కుమారుడు మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. రెండు రోజులు పట్టణంలోని ఓ ఆర్ఎంపీ వైద్యుడి వద్ద చికిత్స చేయించారు. జ్వరం తగ్గినట్టే తగ్గి మళ్లీ పెరిగి ఫిట్స్ వచ్చాయి. సోమవారం రాత్రి కుటుంబ సభ్యులు సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుడి సూచన మేరకు బాలుడిని కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందాడు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలుశిక్ష

కోల్‌సిటీ, జూలై 30: మద్యం సేవించి వాహనం నడిపి రెండవసారి పోలీసులకు పట్టుబడిన కేసులో బామిని భరత్ అనే వ్యక్తికి మంగళవారం గోదావరిఖని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు రెండవ అదనపు న్యాయమూర్తి వెంకటేష్ దుర్వ మూడు రోజుల జైలు శిక్ష విధించారు. మరో 11మందికి రూ.2000చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

గంగాధర, జూలై 30: గంగాధర మండలం మధురానగర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని డీటీసీఎస్, ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు పట్టుకున్నారు. గంగాధర డీటీసీఎస్ ఉష మాట్లాడుతూ మధురానగర్ గ్రామ పరిధిలోని పత్తికుంటపల్లిలోని మామిడితోటలోని ఓ ఇంట్లో అక్రమంగా 40 క్వింటాళ్ల రేసన్ బియ్యం నిల్వ ఉంచినట్లు పక్కా సమాచారం అందింది. మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంటు అధికా రులు, డీటీసీఎస్ బృందం తనిఖీ చేయగా సంచుల్లో నింపిన 40 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడినట్లు తెలిపారు. ఇంటిపక్కన ఉన్న కడమంచి రమేష్ మోటర్ సైకిళ్లమీద ఊళ్లలో సేకరించిన రేషన్ బియ్యా న్ని జగిత్యాలకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎల్లంపల్లి నుంచి కొనసాగుతున్న ఎత్తిపోతలు


గాయత్రి పంప్ హౌస్ నుంచి విడుదలవుతున్న నీరు


ఉధృతంగా ప్రవహిస్తున్న గ్రావిటీ కెనాల్

పెద్దపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరుకు ఎత్తిపోతల ద్వారా నీటి తరలింపు కొనసాగుతున్నది. మంగళవారం ప్రాజెక్టులోకి వస్తున్న వరద నీరు తగ్గుముఖం పట్టినా కూడా ఎత్తిపోతలను అధికారులు కొనసాగిస్తున్నారు. సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి 11,173 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా, ఇందులో కడెం ప్రాజెక్టు నుంచి 3,568 క్యూసెక్కులు, ఎగువ ప్రాంతం నుంచి 7,605 క్యూసెక్కుల నీళ్లు వస్తున్నాయి. మిడ్ మానేరుకు 5 మోటార్ల ద్వారా 15,750 క్యూసెక్కుల నీటిని పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నందిమేడారంలోని నంది పంప్‌హౌస్ ద్వారా గాయత్రి పంప్‌హౌస్‌కు, అక్కడి నుంచి వరద కాలువ ద్వారా మిడ్ మానేరులోకి ఎత్తిపోస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 17.371 టీఎంసీలు ఉన్నాయి.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న పంపింగ్

రామడుగు: మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు జలాశయానికి నాలుగో రోజు కూడా నీటి విడుదల కొనసాగుతుంది. శనివారం 4 బహుబలి పంపు నుంచి నీటి విడుదల చేసిన అధికారులు మంగళవారం కూడా నీటి విడుదల యధావిధిగా కొనసాగించారు. ఐదు పంపుల ద్వారా 15,750 క్యూసెక్కుల నీరు వరద కాలువ ద్వారా ఎస్ఆర్ఆర్ మిడ్ మానేరు డ్యాంలోకి తరలి వెళ్తుంది. డెలివరీ పాయింట్ నుంచి గ్రావిటీ కెనాల్‌లోని ఐదు పంపులు ఒకేసారి విడుదల కావడంతో నీటి ప్రవాహం పెరిగింది. గ్రావిటీ కెనాల్ నుంచి నీటి ప్రవాహం పరవళ్లు తొక్కుతూ వరద కాలువ ద్వారా మిడ్ మానేరుకు తరలిపోతుంది. ఐదు పంపులతో నీటి విడుదల కొనసాగిస్తుండగా అటు గ్రావిటీ కెనాల్ ఇటు వరద కాలువలో నీటి ప్రవాహం కనువిందు చేస్తోంది.

మిడ్ మానేరులో 9టీఎంసీల నీరు

బోయినపల్లి: మండలంలోని మిడ్ మానేరు ప్రాజెక్ట్‌కు గాయత్రి పంప్‌హౌస్ ద్వారా 15,750 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 318 మీటర్లకు 308.46 మీటర్లు, పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 27.50 టీఎంసీలకు 9.19 టీఎంసీలు ఉన్నది.

ఎస్సారెస్పీలోకి 22,285 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ వరద నీరు పెరుగుతోంది. మంగళవారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 22,285 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 35.297 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 76.894 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 664 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 30.058 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

9నుంచి ఎస్‌యూ పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలు

గణేశ్‌నగర్, జూలై 30: ఎస్‌యూ పరిధిలోని పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలు ఆగస్టు 9నుంచి ప్రారంభం కానున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్‌వీ శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలను మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం www.satavahana.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

● ఎంబీఏ, ఎంసీఏ, పరీక్షలు ఆగస్టు 9 నుంచి 19వ తేదీ వరకు జరగనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి తెలిపారు. పరీక్ష సమయం మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ఉంటుందని తెలిపారు.

అటవీభూమిలో సాగును అడ్డుకున్న అధికారులు

వీర్నపల్లి, జూలై 30: వీర్నపల్లి మండలం భూక్యతండా గ్రామ పరిధిలోని రాశిగుట్ట తండాలో అటవీ భూమిలో గిరిజనులు పత్తి సాగు చేస్తుండగా అధికారులు మంగళవారం అడ్డుకున్నారు. అటవీశాఖ అధికారులు గిరిజనులకు మధ్య తోపులాట జరుగడంతో ఉద్రిక్తతకు దారితీసింది. వివరాలు ఇలా ఉన్నాయి. రాశిగుట్ట తండాలో గత ఐదేళ్లుగా అటవీ భూమిని చదును చేసి పత్తిపంట సాగు చేసుకుంటున్నామని గిరిజనులు తెలిపారు. అదే భూమిలో అటవీశాఖ అధికారులు మొక్కల ప్లాంటేషన్ పనులు చేపట్టడంతో గిరిజనులు మొక్కలను తొలగించారు. ఈ భూములను కొన్ని ఏళ్లగా తాము సాగు చేసుకుంటున్నామని గిరిజనులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. గిరిజనులు, అధికారులు ఒకరినొకరు తోసేసుకున్నారు. దీంతో కొద్దిసేపు స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు, వీర్నపల్లి అటవీ సెక్షన్ అధికారి రంజిత్‌కుమార్ తన సిబ్బందితో వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకున్నారు. ఉద్రిక్తత మధ్య అధికారులు అక్కడి నుంచి వెను దిరిగి వెళ్లిపోయారు. చదును చేసిన అటవీ భూమిలో మొక్కలను ప్లానిటేషన్ చేస్తామన్నారు.


గిరిజనులతో మాట్లాడుతున్న అధికారులు

మరమగ్గాల కార్మికులకు పని కల్పించాలి

● గంగాధర ప్రధాన రహదారిపై కార్మికుల ధర్నా

గంగాధర, జూలై30: గర్షకుర్తి మరమగ్గాల కార్మికులకు పనికల్పించి ఆదుకోవాలని గంగాధర మండలం కురిక్యాల ప్రధాన రహదారిపై గర్షకుర్తి, ఉప్పరమల్యాల, తాడిజెర్రి, రంగరావుపల్లి గ్రామాల మగ్గాల కార్మికులు,సంఘ నేతలు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ గత ఎనిమిది నెలలుగా మగ్గాలు నడవక పోషణ భారమవుతుందన్నారు. గర్షకుర్తి మగ్గాలకు బతుకమ్మ చీరల ఉత్పత్తి ఆర్డర్లు, గుడ్డ ఉత్పత్తి ఆర్డర్లను ప్రభుత్వం ఇప్పించాలని డిమాండ్ చేశారు. గతంలో ఉత్పత్తి చేసిన బతుకమ్మ చీరల కోట్ల బకాలు నిలిచి పోయాయని ప్రభుత్వం వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. గర్షకుర్తిలో గత ఆరు రోజులుగా ధర్నాలు చేస్తున్న కనీసం ప్రభుత్వం నుండి స్పందన లేదని అన్నారు. మగ్గాల కార్మికులకు తక్షణం పని కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా కురిక్యాల రహదారిపై కార్మికుల ధర్నాతో వాహనాలు భారీగా నిలిచిపోయాయి, ఎస్ఐ కిరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరసనకారులను శాంతింపజేసి ధర్నాను విరమింపజేశారు. కార్మికులకు మద్దతు తెలిపిన మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే కార్మికుల డిమాండ్లను నెరవేర్చి చేతినిండా పని కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల మగ్గాల కార్మికులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.


గంగాధర ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న మగ్గాల కార్మికులు

జాతీయ స్థాయిలో రాణించిన విద్యార్థి

రామడుగు, జూలై 30: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన దాసరి దీపక్ అండర్-14 క్రికెట్ టీం తెలంగాణ రాష్ట్రం తరపున జాతీయ స్థాయిలో ఆడి సత్తా చాటాడు. దీంతో పాటు నేపాల్‌లో జరిగిన క్రికెట్ పోటీల్లో ఆల్ రౌండర్‌గా రాణించాడు. ఈ మేరకు ఆటల్లో రాణించిన విద్యార్థిని మాజీ ఎంపీటీసీ ఎడవెల్లి సురేందర్ రెడ్డి, నేచర్ యూత్ క్లబ్ అంబేద్కర్ యువజన సంఘం తరపున శాలువాతో ఘనంగా సత్కారించారు.ఈ కార్యక్రమంలో నేచర్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కాసారపు పరశురాం, బుర్ర శ్రీకాంత్, రేణిగుంట అశోక్ పాల్గొన్నారు.

రూ.7,150 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, జూలై 30: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,150 పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు ఒక రైతు 15క్వింటాళ్ల విడి పత్తి విక్రయానికి తీసుకు వచ్చాడు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర రూ.7150 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

రుణమాఫీ కార్యక్రమంలో అల్లునూర్ రైతు


హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో సీఎంతో రైతు జాప లక్ష్మారెడ్డి

తిమ్మాపూర్, జూలై30: రైతు రుణామాఫీలో కార్యక్రమంలో భాగంగా 1లక్ష 50వేల వరకు రైతులకు రెండవ విడత నిధుల విడుదల కార్యక్రమాన్ని మంగళవారం హైదారాబాద్‌లోని అసెంబ్లీ ఆవరణలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లాంచనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఇతర జిల్లాల నుంచి వచ్చిన రైతులతో పాటు జాప లక్ష్మారెడ్డి పాల్గొని రైతు కుంటుంబాలకు సీఎం రేవంత్ రెడ్డి అందజేసిన చెక్కును అందుకున్నాడు. తనకు 1లక్ష 22వేల 979రూపాయల రుణమాఫీ అయిందని తెలిపాడు. సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్న కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా లక్ష్మారెడ్డి పేర్కొన్నారు.

అక్రమంగా ఇంటి మార్పిడి చేసిన వారిపై కేసు

గంగాధర, జూలై30: గంగాధర మండలం కొండన్నపల్లిలో అక్రమంగా ఇంటి మార్పిడి చేసిన వ్యక్తితో పాటు అప్పటి కార్యదర్శిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కొండన్నపల్లికి చెందిన కడార్ల ఆగయ్యకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆగయ్య గతకొన్ని సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆగయ్యకు వెంకటాచారి, సత్యనారాణ ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆగయ్యకు గ్రామంలో వారసత్వంగా ఉన్న ఇంటిని ఇద్దరి అన్నదమ్ములకు చెందవలసి ఉండగా సత్యనారాయణ పేరుపై 2018లో అప్పటి కార్యదర్శి మార్పిడి చేశాడు. వెంకటచారి ఫిర్యాదు మేరకు సత్యనారాయణ, అప్పట్లో గ్రామంలో పనిచేసిన కార్యదర్శిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ప్రభుత్వ వైద్యుడిపై దాడి


గాయపడిన వైద్యుడు

కాల్వశ్రీరాంపూర్, జూలై 30: కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న డాక్టర్ మహేందర్ విధులు ముగించుకొని పెద్దపల్లికి వెళ్తుండగా మార్గమధ్యలో గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. ఈ దాడిలో డాక్టర్ మహేందర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వైద్య చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. కాల్వ శ్రీరాంపూర్ ప్రభుత్వాసుపత్రిలో విధులు నిర్వహించి సాయంత్రం తన కారులో పెద్దపెల్లికి వెళుతుండగా మార్గ మధ్యలో గుర్తు తెలియని వ్యక్తులు దాడిచేసి పారిపోయినట్లు సమాచారం.

కుక్కను తప్పించబోయి యువకుడికి తీవ్ర గాయాలు

జమ్మికుంట రూరల్, జూలై 30: జమ్మికుంట మండలం గోవిందాపూర్ గ్రామంలో ఓ యువకుడు కుక్కను తప్పించబోయి ద్విచక్రవాహనం మీద నుంచి కింద పడి తీవ్ర గాయాలపాలయ్యాడు. వీణవంక మండలం లస్మక్కపేట గ్రామానికి చెందిన దాసారపు సతీష్ గోవిందాపూర్ గ్రామంలో ఎదురుగా వస్తున్న కుక్కను తప్పించబోయి ప్రమాదవశాత్తు ద్విచక్రవాహనం మీద నుంచి కింద పడ్డాడు. తలకు, కాళ్లకు తీవ్రగాయాలు కాగా, చికిత్స నిమిత్తం 108వాహనంలో జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

గ్రామాల్లో కోతుల బెడద

● దాడుల్లో పలువురికి గాయాలు ● కలెక్టర్‌కు వినతి


గాయపడిన వృద్ధురాలు

కరీంనగర్ రూరల్, జూలై30: కరీంనగర్ మండలంలోని పలు గ్రామాల్లో కోతుల బెడద తీవ్రంగా ఉండటంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని ఎలబోతారం గ్రామంలో సమీపంలో గుట్ట ఉండటంతో కోతుల సంచారం పెరిగింది. అయితే మంగళవారం గ్రామంలోకి ప్రవేశించిన కోతులు పలువురిని గాయపరచగా వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గ్రామానికి చెందిన ఆడెపు మల్లమ్మ, వాసల శేషమ్మ, తుమ్మణవేని లక్ష్మీ, దుబ్బెట భూమక్కలపై దాడి చేశాయి. కోతి కరవడంతో గాయపడిన వాళ్లు కరీంనగర్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నారు. అయితే గత వారం రోజుల కిందట కూడా పత్తెం శ్రీనివాస్ కూతురు అనన్యపై దాడి చేయగా చిన్నారికి కూడా తీవ్ర గాయాలయ్యాయి. కోతుల బెడద నుంచి కాపాడాలని జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా అధ్యక్షుడు మాసం సుధాకర్ మంగళవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కోతుల నుంచి ప్రజలను రక్షించేందుకు చర్యలు చేపట్టాలని, మహిళలు చిన్నారులపై దాడి చేస్తున్న కోతులను పట్టుకునేందుకు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్టీసీకి 'మహాలక్ష్మి'తో ఊపు

● ఉమ్మడి జిల్లాలో రూ.230.72 కోట్ల ఆదాయం



భగత్‌నగర్, జూలై 30: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మహాలక్ష్మి పథకం ద్వారా ఆదాయం 230.72 కోట్ల రూపాయలు సమకూరింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రకటించడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బస్సులన్నీ కిక్కిరిసి పోతున్నాయి. ఆర్టీసీలో ప్రయాణించిన మహిళల కోసం మహాలక్ష్మి పథకం కింద ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు డబ్బులు చెల్లించనుంది. కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ప్రకటించిన 2023 డిసెంబర్ 9 నుంచి మంగళవారం వరకు మహాలక్ష్మి పథకం కింద 6.35 కోట్ల మంది ప్రయాణించారు. కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా కరీంనగర్-1, కరీంనగర్-2, జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల, సిరిసిల్ల, వేములవాడ, గోదావరిఖని, మంథని, హుజూరాబాద్ హుస్నాబాద్ డిపోలు ఉండగా వాటిలో రీజియన్ ఆదాయంలో మొత్తంలో మహాలక్ష్మి ఆదాయం 49.22 శాతంగా ఉండడం విశేషం. మహాలక్ష్మి పథకం అమలు కంటే ముందు 68.13 శాతం ఆక్యుపెన్సీ రేషియా ఉండగా, మహాలక్ష్మి పథకం అమలు తర్వాత 85.33 శాతానికి పెరిగింది. మహాలక్ష్మి పథకం అమలు తర్వాత ప్రయాణికుల సంఖ్య 4.15లక్షలకు పెరగడంతో తెలంగాణరాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు రీజియన్ వ్యాప్తంగా భారీ మొత్తంలో ఆదాయం సమకూరింది.

రద్దీకి అనుగుణంగా బస్సులు

-రీజనల్ మేనేజర్ సుచరిత



తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రీజియన్ వ్యాప్తంగా ఉన్న 11 డిపోల్లో ఆర్టీసీ బస్సులను రద్దీకి అనుగుణంగా నడిపిస్తున్నాం. మహాలక్ష్మి పథకం అమలు తర్వాత రద్దీని బట్టి అన్ని డిపోల్లో బస్సుల సంఖ్య పెంచాం.ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా సంస్థ ఉద్యోగులంతా కలిసికట్టుగా పనిచేస్తున్నాం. ఆర్టీసీని మరింత బలోపేతం చేస్తాం.

ఆలయాల్లో చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

● నిందితుడిపై 17 కేసులు ● సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట, జూలై 30: పలు ఆలయాల్లో చోరీకి పాల్పడిన కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ గ్రామానికి చెందిన బుద్ధుల యుగేందర్‌ను అరెస్ట్ చేసినట్టు సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఆయన వివరాలను వెల్లడించారు. నిందితుడి వద్ద నుంచి రూ. వేయి నగదు, దొంగతనాలను వినియోగించిన ఇనుప రాడ్‌ను స్వాధీన పర్చుకున్నామని పేర్కొన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో యుగేందర్‌పై 17 కేసులున్నాయని వివరించారు. డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి వెల్లడించిన వివరాల మేరకు.. కరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ గ్రామానికి చెందిన బుద్ధుల యుగేందర్ కూలీ పనులు చేయడంతో పాటు వ్యాన్‌లో క్లీనర్‌గా కొనసాగేవాడు. మద్యం, జల్సాలకు అలవాటు పడిన అతడు సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో చోరీలకు దిగాడు. 2010 నుంచి 2018 వరకు కరీంనగర్ పట్టణంలో పలు దొంగతనాలను పాల్పడి పోలీసులకు చిక్కాడు. అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జైలు జీవితం గడిపి బయటకు వచ్చిన యుగేందర్ ఈ నెల 26న ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట మండలాల్లోని రాచర్లబొప్పాపూర్, గోరంట్యాల గ్రామంలోని పెద్దమ్మ, ఎల్లమ్మ, సాయిబాబా ఆలయాల్లో చోరీకి పాల్పడ్డాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులకు ఈ నెల 30న నిందితుడు దొంగతనం చేయడం కోసం కరీంనగర్ నుంచి ఎల్లారెడ్డిపేటకు వస్తున్నాడనే సమాచారంతో స్థానిక బస్టాండ్ ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి రూ.వేయి నగదుతో పాటు చోరీకి వినియోగించే ఇనుప రాడ్‌ను స్వాధీనపర్చుకున్నారు. విచారించగా పలు ఆలయాల్లో దొంగతనాలను పాల్పడ్డానని అంగీకరించాడు. కేసును ఛేదించడంలో కీలకపాత్ర పోషించిన సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐ రమాకాంత్, క్లూస్ టీం ఏఎస్ఐ శరత్, సిబ్బంది బాబయ్య, రాజేందర్, శ్రీనాథ్‌లను డీఎస్పీ అభినందించారు.

డిప్లొమా కోర్సుల కోసం డైట్‌లో ధ్రువపత్రాల పరిశీలన

తిమ్మాపూర్, జూలై30: ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్)లో రెండు సంవత్సరాల కోర్సులైన డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డిఇఎల్ఇడి), డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్(డిఇఎస్ఈ) మొదటి సంవత్సరంలో 2024-25 చేరేందుకు నిర్వహించిన డిఈఈసెట్-2024 ఫలితాలు వెల్లడైనట్లు డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫలితాలు సంబంధిత వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఉత్తీర్ణులైన పాత కరీంనగర్ జిల్లాకు సంబంధించిన అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాల పరిశీలన ఆన్‌లైన్ విధానంలో ఆగస్టు 1,2వ తేదీలు రెండు రోజుల్లో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ(డైట్), కరీంనగర్ జిల్లా, తిమ్మాపూర్ మండలం, ఎల్ఎండీ కాలనీలో జరగనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు తమ డీఈఈసెట్-2024 హాల్ టికెట్, ర్యాంక్ కార్డు, ఎస్ఎస్‌సి, ఇంటర్ మెమోలు, ఇంటర్ వరకు స్టడీ, కుల, ఆదాయ(2024) ధ్రువపత్రాలతో పాటు ఇతర ప్రత్యేక పత్రాలు(పిహెచ్‌సి, ఎన్‌సిసి, సిఏసి ఉంటే) ఒరిజినల్స్ వెంట తీసుకుని రావాలని పేర్కొన్నారు.

జీప్యాట్‌లో ఎస్‌యూ ఫార్మసీ విద్యార్థుల ప్రతిభ


వై.స్నేహ


జి.నందిని

గణేశ్‌నగర్, జూలై 30: అఖిల భారత స్థాయిలో నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ నిర్వహించిన జీప్యాట్ (గ్రాడ్యుయేట్ ఫార్మసీ ఆప్టిట్యూడ్ టెస్ట్)లో శాతవాహన విశ్వ విద్యా లయ ఫార్మసీ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీశైలం తెలిపారు. మొత్తం పదిహేడు మంది విద్యార్థులు జి.నందిని, వై.స్నేహ, ఏ.రమ్య, ఏ.లోకేశ్, యం సాయికిరణ్, జి.ప్రత్యూష, పి.నవిత, డి.మేఘన, బి.పల్లవి, కె.శివాని, యం.ప్రవళిక, బి.మోహన్, సీహెచ్ చక్రధర్, యన్.శిరీష, యం.నితిన్, డి.విజయ్, కె.ప్రభాస్ అర్హత సాధించినట్లు ఆయన తెలిపారు. ఇన్‌చార్జి వీసీ సురేంద్రమోహన్, రిజిస్ట్రార్ వర్రప్రసాద్ విద్యార్థులను అభినందించారు. కళాశాల సహాయ రిజిస్ట్రార్ వై.కిషోర్, అధ్యాపకులు భాగ్యలక్ష్మి, జి యల్ అర్చన, డా. అనిల్ కుమార్, తిరుపతి, పి.క్రాంతి రాజు, జె. అశ్విని విద్యార్థులను అభినందించారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి

కరీంనగర్ క్రైం, జూలై 30: విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలని కరీంనగర్ టౌన్ ఏసీపీ నరేందర్ అన్నారు. భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్(యూఎస్‌ఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ముద్రించిన పోస్టర్‌ను ఏసీపీ మంగళవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి తిరుపతి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాహుల్, గణేష్, సంపత్, కుమార్ పాల్గొన్నారు.

క్రీడలతో ఆత్మవిశ్వాసం పెంపొందుతుంది

కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 30: క్రీడలతో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని జాతీయ యువజన అవార్డు గ్రహీత, న్యాయవాది ఎ కిరణ్‌కుమార్ అన్నారు. ఇటీవల జాతీయ స్థాయి సబ్‌జూనియర్ హాకీ పోటీలకు ఎంపికైన కరీంనగర్‌కు చెందిన తమ్మిశెట్టి శశాంక్‌ను జస్టిస్ కుమారయ్య లా కాలేజీ అడ్వకేట్స్ మిత్రబృందం ఆధ్వర్యంలో మంగళవారం సత్కారం చేశారు. ఈనెల 19 నుంచి 26 వరకు కేరళ రాష్ట్రంలోని కోల్లాంలో నిర్వహించిన జాతీయ హాకీ పోటీల్లో శశాంక్ తెలంగాణ రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించి ప్రతిభ చాటాడు. కార్యక్రమంలో కోచ్ మహ్మద్ తారీఖ్ అలీ, క్రీడాకారుడి తల్లిదండ్రులు భవాని, రాజు, అడ్వకేట్స్ మిత్ర బృందం మంతెన సురేష్‌కుమార్, బొంకూరి మోహన్, మడిపెల్లి వినీత్‌కుమార్, ఎన్నం మమత, కొత్త స్వతంత్ర భారతి, పొన్నం రజిత, అట్ల దీరజ్, మౌలాలి, దినేష్, నవీన్ పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని రక్షించిన లేక్ పోలీసులు

కరీంనగర్ క్రైం, జూలై 30: ఆర్థిక ఇబ్బందులతో మానేరు జలాశయంలో దూకి ఆత్మహత్యకు ప్రయత్నించిన అశోక్‌నగర్‌కు చెందిన మాదారి రవీందర్(51)ని లేక్ పోలీసులు రక్షించినట్లు ఒకటో టౌన్ సీఐ సరిలాల్ తెలిపారు. అశోక్‌నగర్‌కు చెందిన రవీందర్ ఆర్థిక ఇబ్బందులతో మనస్థాపానికి గురై సోమవారం అర్ధరాత్రి మానేరు జలాశయంలో దూకేందుకు ప్రయత్నించగా అక్కడ విధుల్లో ఉన్న లేక్ అవుట్‌పోస్ట్ కానిస్టేబుల్ సారయ్య ఎస్‌ఐ అర్షం సురేష్‌లు కాపాడారని సీఐ తెలిపారు. కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చామని తెలిపారు.

వ్యవసాయ కార్మిక సంక్షేమచట్టం అమలు చేయాలి

భగత్‌నగర్, జూలై 30: రాష్ట్రంలోని వ్యవసాయ కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టం అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదరిర్శ కొయ్యడ సృజన్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బోయిని అశోక్, ఎగుర్ల మల్లేశం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేపు స్లాటర్‌హౌస్‌కు వేలం

కరీంనగర్ టౌన్, జూలై 30: నగరంలో గొర్రెలు, మేకల వధశాల (స్లాటర్ హౌస్)నిర్వహణకు గురువారం సాయంత్రం 4 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు.

కరాటే పోటీల బ్రోచర్ ఆవిష్కరణ

కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 30: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆగస్టు 4న జీఆర్ఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న గౌరు నారాయణరెడ్డి మెమోరియల్ జాతీయ కరాటే పోటీల బ్రోచర్‌ను కలెక్టర్ పమేలా సత్పతి ఆవిష్కరించారు. కార్యక్రమంలో పోటీల నిర్వహకులు గౌరు రాజిరెడ్డి, అకాడమీ సీనియర్ క్రీడాకారులు గాజుల దీప్తి, బి.మాలతి, ఎం.భవాని పాల్గొన్నారు.

రేపు ఆటో డ్రైవర్ల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలి

కరీంనగర్ టౌన్, జూలై 30: ఆటో డ్రైవర్ల దినోత్సవాన్ని ఆగస్టు 1న నగరంలో ఘనంగా జరుపుకోవాలని ఆటో డ్రైవర్ల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆటో డ్రైవర్లకు పిలుపునిచ్చారు. ఈమేరకు మంగళవారం నగరంలోని ఆయన కార్యాలయంలో ఆటో డ్రైవర్ల సంక్షేమ సంఘం రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మద్దెల రాజేందర్, ప్రధాన కార్యదర్శి బండారి సంపత్ పటేల్, ఉపాధ్యక్షులు రాంగోపాల్‌రెడ్డి, నర్సింహా నాయక్, కార్యవర్గసభ్యులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్

సుభాష్‌నగర్, జూలై 30: ప్రభుత్వ నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ మంగళవారం కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా నర్సింగ్ స్కూలు సమస్యలు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

కరీంనగర్ అర్బన్, జూలై 30 : ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను అమలు చేస్తున్నదని మాజీ ఎమ్మెల్యే, సీనియర్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఆరెపల్లి మోహన్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం లక్షన్నర రూపాయల రైతు రుణమాఫీ చేసిన సందర్భంగా కరీంనగర్ 30వ డివిజన్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు దొంతి గోపి ఆధ్వర్యంలో మారుతినగర్‌లో రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ కార్యక్రమం నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఫొటోకు క్షీరాభిషేకం చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

● హుజూరాబాద్: హుజూరాబాద్ కేసీ క్యాంపులోని రైతు వేదికలో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి రెండో విడత రుణమాఫీ చేయడం పట్ల కాంగ్రెస్ నాయకులు రైతులతో కలిసి సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కొల్లూరి కిరణ్, సొల్లు బాబు, మిడిదొడ్డి రాజు, ఎండీ అప్సర్, శంకర్, బాబు, లావన్య, సంపత్, మహేందర్‌గౌడ్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

● మానకొండూర్ : మానకొండూర్‌లోని రైతు వేదికలో జరిగిన రుణమాఫీ వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

వనమహోత్సవంలో 43లక్షల మొక్కలు టార్గెట్
● డీఆర్‌డీవో శ్రీధర్

మానకొండూర్, జూలై 30 : వనమహోత్సవ కార్యక్రమంలో జిల్లాలో 43లక్షల 47వేల మొక్కలను నాటేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని డీఆర్‌డివో శ్రీధర్ అన్నారు. మానకొండూర్‌లో ఉపాధి కూలీలు మొక్కలు నాటే ప్రదేశాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటి వరకు 25లక్షలు 60శాతం నాటడడం పూర్తి అయిందన్నారు. మరో 40 శాతం మొక్కలను ఆగస్టు 15 వరకు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ప్రతి మొక్కను పశువుల బారి నుంచి కాపాడేందుకు కంచెలను ఏర్పాటు చేయాలన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

హుజూరాబాద్ రూరల్, జూలై 30: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి టీయూడబ్ల్యూజే ఐజేయూ నాయకులు కృషి చేసేందుకు సిద్ధంగా ఉన్నారని మాజీ జిల్లా అధ్యక్షుడు గాండ్ల శ్రీనివాస్, రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎలగందుల రవి అన్నారు. మంగళవారం హుజూరాబాద్ పట్టణంలోని విశేష కన్వెన్షన్ హాల్‌లో టీయూడబ్ల్యూజే ఐజేయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం హుజూరాబాద్ ప్రెస్ క్లబ్ కన్వీనర్ గడ్డం ధర్మారెడ్డి అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు మహేంద్రచారి, కోరం సుధాకర్‌రెడ్డి, తిర్లగిరి ఆంజనేయులు, కాయిత రాములు, మల్లారెడ్డి, మామిడి రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ బాలుడి మృతి


హిమాన్షు (ఫైల్)

భీమదేవరపల్లి, జూలై 30 : భీమదేవరపల్లి మండలం సమ్మక్క గుట్ట వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి భీమెర హిమాన్షు (8) చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. ముల్కనూర్ ఎస్ఐ సాయి బాబు కథనం ప్రకారం.. కరీంనగర్ జిల్లా చిగురు మామిడి మండలం ఇందుర్తి గ్రామానికి చెందిన భీమెర రమేష్-గౌతమి దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు హనుమకొండలో చదువుతుండగా, చిన్న కుమారుడు హిమాన్షు, రమేష్-గౌతమి దంపతులు ద్విచక్ర వాహనంపై హనుమకొండకు వస్తున్నారు. సమ్మక్క గుట్ట వద్ద హిమాన్షు మూ త్ర విసర్జన కోసం ద్విచక్ర వాహనాన్ని ఆపాడు. వెనుక నుంచి వచ్చిన ముల్క నూర్ మహిళా డెయిరీ పాల వ్యాన్ బలంగా ఢీకొట్టింది. దీంతో దంపతులైనా రమేష్-గౌతమిలకు గాయాలు కాగా, హిమాన్షుకు తీవ్ర గాయాలయ్యాయి. వరంగల్‌లోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ హిమాన్షు మంగళవారం రాత్రి మృతి చెందాడు. తల్లిదండ్రులిద్దరూ చికిత్స పొందుతున్నారు.

మూఢ నమ్మకాలను విడనాడాలి

-భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పులేటి నరేష్


మూఢ నమ్మకాల నిర్మూలనపై ప్రదర్శన నిర్వహిస్తున్న ఉప్పులేటి నరేష్

కరీంనగర్ టౌన్, జూలై 30: విద్యార్థులు మూఢ నమ్మకాలను విడనాడాలని భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పులేటి నరేష్ అన్నారు. కరీంనగర్ లోని అంబేద్కర్ పాలిటెక్నిక్ ఉమెన్స్ కళాశాలలో ప్రిన్సిపాల్ వాణి అధ్యక్షతన మంగళ వారం మానవ విలువలు-మూఢ నమ్మకాల నిర్మూలన అనే అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఉప్పులేటి నరేష్ మాట్లాడుతూ శాస్త్ర విజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందుతున్న తరుణంలో ఇప్పటికీ గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో మూఢ నమ్మకాలు నమ్మడం దురదృష్టకరమన్నారు. స్త్రీ విద్యతో దేశ అభి వృద్ధి సాధ్యమని అన్నారు. విద్యార్థి దశలోనే మూఢ నమ్మకాలు వీడుతూ సమాజాభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. దొంగస్వాములు, భూత వైద్యులు ప్రజల అమాయ కత్వాన్ని ఆసరాగా చేసుకుని ఆర్థికంగా మోసం చేస్తున్నారని అన్నారు. దయ్యాలు, భూతాలు మంత్రాలు బూటకమని తెలిపారు. సైన్స్‌కు అనుగుణంగా విద్యార్థులు ముందుకు నడవాలని సూచించారు. ఉన్నత చదువులతో విద్యార్థులు తల్లిదండ్రుల లక్ష్యాలను నెరవేర్చాలని ఆయన సూచించారు. సైన్స్ మ్యాజిక్ షో నిర్వహించిన నరేష్ ఇనుప కత్తిని కడుపులో గుచ్చుకోవడం, విద్యార్థి చేతిపై కిరోసిన్‌తో కాల్చడం, నోట్లో మంటలు లేపడం, గాలిలో విభూది సృష్టించడం, పేపర్లు కాల్చి చాక్లెట్లు చేయడం, విద్యార్థి వాచిని మాయం చేసి రింగు తీసి ఇవ్వడం లాంటి అనేక ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో హెడ్ ఆఫ్ కంప్యూటర్ బూరం అభినవ్ పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్స్ ఆధ్వర్యంలో అన్నదానం

సుభాష్‌నగర్, జూలై 30: లయన్స్‌క్లబ్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఘట్టమనేని బాబురావు జన్మదినాన్ని పురస్కరించుకొని వివిధ లయన్స్‌క్లబ్స్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆరోగ్యకేంద్రంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంసీసీ హన్మండ్ల రాజిరెడ్డి, ఎఫ్‌వీడీజీ సింహరాజు కోదండరాములు, ఎస్‌వీడీజీ మోర బద్రేశం, డీసీజీఎస్ నడిపెల్లి ప్రసాద్‌రావు, మీల్స్ ఆన్ వీల్స్ చీఫ్ కోఆర్డినేటర్ రావికంటి కృష్ణకిషోర్ పాల్గొన్నారు. రాజరాజేశ్వరి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా ఆసుపత్రిలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి నరహరి లక్ష్మారెడ్డి, రాళ్ళబండి శంకర్‌ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. మంకమ్మతోట లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మార్కెట్‌రోడ్‌లో గల వేంకటేశ్వర దేవాలయంలో సమీపంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బూర్ల విద్యాసాగర్, కార్యదర్శి అంబటి రవీందర్‌రాజు, కోశాధికారి విశ్వనాథం పాల్గొన్నారు.

అల్పాహార వితరణ

కరీంనగర్ రూరల్, జూలై30: కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామంలో లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ గట్టమనేని బాబురావు జన్మదినం సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ బొమ్మకల్ ఆధ్వర్యంలో ఇటుక బట్టి కార్మికులకు, మంగళవారం అల్పాహార వితర చేశారు. ఈకార్యక్రమంలో ప్రసిడెంట్ కామిరెడ్డి నరసింహారెడ్డి, జోన్ చైర్మన్ చింతల కిషన్, బట్టు రాజేందర్, మాసినేని చక్రదర్, ఆసిరి సుమన్, బోడ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. హౌసింగ్ బోర్డు కాలనీలో వీరబ్రహ్మేంద్ర స్వామి వృద్ధాశ్రమంలో ఆల్పాహరణ వితరణ చేయగా కార్యక్రమంలో తోట రాజేందర్, చింతలకిషన్, వెంకటేష్, మందవెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

'జీఎస్టీ కుంభకోణంపై విచారణ జరిపించాలి'

కరీంనగర్ టౌన్, జూలై 30: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీ సోమేష్‌కుమార్ జీఎస్టీ కుంభకోణంపై ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి కల్యాడపు ఆగయ్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్య కార్యదర్శి ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టి 1400కోట్ల కుంభకోణానికి పాల్పడటం సిగ్గుచేటన్నారు.

మారథాన్ పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 30: కరీంనగర్ రన్నర్స్ అండ్ సైకిలిస్టు అసోసియేషన్, జిల్లా యంత్రాంగం సహకారంతో సెప్టెంబర్ 22న జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించ నున్న రెండవ ఎడిషన్ కరీంనగర్ మారథాన్ పోస్టర్‌ను కలెక్టర్ పమేలా సత్పతి ఆవిష్క రించారు. ఈ సందర్భంగా కరీంనగర్ రన్నర్స్ అండ్ సైకిలిస్టు అసోసియేషన్ అధ్యక్షుడు పసుల మహేశ్ మాట్లాడుతూ గత సంవత్సరం ఒకటవ ఎడిషన్ విజయ వంతమైందన్నారు. రెండవ ఎడిషన్‌ను ప్రకటించడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ మారథాన్‌లో నాలుగు కేటగిరీలు ఉంటాయని, 3కె, 5కె, 10కె, 21కె లలో పోటీలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. పోటీలో పాల్గొనే వారు మారథాన్ లింక్‌ను ఉపయోగించి మాత్రమే తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. పాల్గొనే వారికి టీషర్టు, మెడల్, డిజిటల్ సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. వివరాలకు 7259265758 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రోడ్డుకు మరమ్మతు చేయించాలి


ఆర్‌అండ్‌బీ అధికారికి వినతిపత్రం నాయకులు

కరీంనగర్ రూరల్, జూలై30: కరీంనగర్ శివారులోని రైల్వేస్టేషన్ సమీపంలో ప్రధాన రహదారిపై ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా రహదారి దెబ్బతిందని వెంటనే మరమ్మతు చేపట్టాలని తీగలగుట్టపల్లికి చెందిన సీనియర్ నాయకుడు కాశెట్టి శ్రీనివాస్ ఆర్‌అండ్‌బీ ఈఈ సాంబశివరావుకు మంగళవారం వినతిపత్రం అందించారు. రైల్వేబ్రిడ్జి పనుల్లో భాగంగా రహదారి వర్షం కారణంగా పూర్తిగా బురదమయం అయి గుంతలు పడ్డాయని తెలిపారు. ఈ రహదారి వెంబడి వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గ్రానైట్, కంకర మిక్సింగ్ పోసిన భారీ వాహనాలు ఈ మార్గం గుండా వెళ్తున్నాయన్నారు. దీంతో రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయని తెలిపారు. రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ మూల కృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ కాశెట్టి దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

జ్వరాల కాలం..
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

సుభాష్‌నగర్, జూలై 30: ముసురు వర్షాలతో జిల్లాలో జ్వర బాధితులు పెరుగుతున్నారు. ఏ ఇంట్లో చూసినా జ్వరం వచ్చిన వారు ఒక్కరో.. ఇద్దరో ఉంటున్నారు. డెంగీ నిర్ధారణకు ప్రైవేట్ ఆసుపత్రుల్లో చేసే ఎస్ఎస్-1 టెస్ట్‌తో ఖచ్చితమైన ఫలితాలు రావు. జిల్లా ఆసుపత్రిలో మాత్రమే ఎలీసా టెస్టు అందుబాటులో ఉంది. ఈ పరీక్ష ద్వారానే కచ్చితమైన ఫలితాలు వస్తాయి. ఈ విషయం తెలియని ప్రజలు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి పరీక్షల కోసం వేల రూపాయలు ఖర్చు చేస్తున్నారు.

● ప్లేట్‌లెట్స్ తగ్గగానే డెంగీ టెస్టులు

దగ్గు, జలుబు, తలనొప్పి ఒళ్లు నొప్పులు రాగానే సహజంగా శరీరం వేడెక్కుతుంది. ప్రజలు భయపడి ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు.వైద్యులు అన్ని టెస్టులు చేస్తున్నారు. ప్లేట్‌లెట్‌లు ఏమాత్రం తగ్గినా డెంగీ టెస్టు చేయిస్తున్నారు. కొందరు అలా వెళ్లిన వెంటనే డెంగీ లక్షణాలున్నాయని చెప్పేస్తున్నారు. ప్లేట్‌లెట్‌లు లక్షలోపు ఉంటేనే డెంగీ నిర్ధరాణ చేయాల్సి ఉంటుంది. దోమలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఎలీసా టెస్టుతోనే డెంగీ నిర్ధారణ
-డాక్టర్ సుజాత, డీఎంహెచ్‌వో



ప్రైవేటు ఆసుపత్రులు, ల్యాబ్‌లలో ఇష్టారాజ్యంగా టెస్టులు చేస్తూ ఫీజులు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. లిఖిత పూర్వకంగా ఇస్తే చర్యలు తీసుకుంటాం. డెంగీని నిర్ధారించే ఎలీసా టెస్టు జిల్లా ఆసుపత్రిలో మాత్రమే అందుబాటులో ఉంది. దీంతోనే డెంగీని గుర్తించవచ్చు.

పోగొట్టుకున్న డబ్బులను అందజేసిన ఏసీపీ


పోగొట్టుకున్న నగదును బాధితుడికి అందజేస్తున్న ఏసీపీ శ్రీనివాస్‌జీ

హుజూరాబాద్, జూలై 30: వారం రోజుల క్రితం ఆర్టీసీ బస్సులో రూ. 2లక్షలు ఉన్న బ్యాగ్‌ను మరిచిపోయిన వ్యక్తిని గుర్తించి పోగొట్టుకున్న డబ్బులను మంగళవారం పోలీసులు అందించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 24న ఆర్టీసీ బస్సులో గుర్తు తెలియని వ్యక్తి రూ. 2లక్షలు కలిగిన బ్యాగ్‌ను మరిచిపోయాడు. ఆ బ్యాగ్‌ను చూసిన ప్రయాణికులు హుజూరాబాద్ పోలీస్‌స్టేషన్లో అప్పగించారు. ఆ డబ్బులను బాధితుడికి అందజేయాలని వివిధ పత్రికలు, సోషల్ మీడియా ద్వారా సమాచారం తెలియజేసేలా ప్రచురితం చేశారు. బ్యాగ్ పోగొట్టుకున్న బాధితుడు ఆధారాలతో రావాలని సూచించగా హనుమకొండ జిల్లా బావుపేటకు చెందిన మేకల రాజయ్య రాగా విచారణ జరిపారు. విచారణలో డబ్బులు అతనివేనని తెలియగా రూ.2లక్షల బ్యాగ్‌ను ఏసీపీ శ్రీనివాస్‌జీ బాధితుడు రాజయ్యకు అందజేశారు. దీంతో రాజయ్య పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టౌన్ సీఐ రమేష్, ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించకుంటే చర్యలు
- మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్

జమ్మికుంట, జూలై 30: నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించకుంటే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ అన్నారు. మంగళవారం జమ్మికుంట పట్టణంలోని వీణవంక రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న స్ట్రీట్ వెండర్స్ షెడ్లను కమిషనర్ పరిశీలించారు. పనుల్లో ఏ మాత్రం నిర్లక్ష్యం కనబరిచిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

హుజూరాబాద్‌లో డ్రైడే కార్యక్రమం

హుజూరాబాద్, జూలై 30: హుజూరాబాద్ పట్టణంలోని 3వ వార్డులో మంగళవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు పరిసరాలను పరిశుభ్రతను పాటించి ఆరోగ్యంగా ఉండాలని మున్సిపల్ సిబ్బంది సూచించారు. కార్యక్రమంలో మెడికల్ హెల్త్ ఆఫీసర్ జరీనా, ఇన్‌చార్జి సానిటరీ ఇన్‌స్పెక్టర్ కిషన్‌రావు, ఆశావర్కర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

చొప్పదండి,జూలై 30 : బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణ నాయకత్వంలో ఆగస్టు 5,6,7, తేదీల్లో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు నర్సింగోజు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం చొప్పదండిలో చలో ఢిల్లీ పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, దేశవ్యాప్తంగా జనాభాలో బిసి కులగణనను వెంటనే ప్రారంభించాలని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖని ఏర్పాటు చేయాలని, క్రిమిలేయర్ ఎత్తివేయాలని ప్రధాన డిమాండ్లతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మహిళ అధ్యక్షురాలు గుంటి స్వరూప జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిగుర్ల శ్రీనివాస్,బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు నర్సింగోజు శ్రీనివాస్ నగర అధ్యక్షులు నితిన్, జిల్లా ఉపాధ్యక్షులు నల్లగొని శ్రీనివాస్ ఉన్నారు.

జేఎండబ్ల్యూపీ సభ్యులను పోలీసులు వెంటనే విడుదల చేయాలి

హుజూరాబాద్, జూలై 30: ఏటూరునాగారం, మహదేవ్‌పూర్ దళంలోని నిరాయిధులైన ముగ్గురు సభ్యులను ఈ నెల 29న పోలీసులు పట్టుకొని ఎన్‌కౌంటర్ పేరిట చంపే ప్రయత్నం చేస్తున్నారని, వారిని వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) జేఎండబ్ల్యూపీ డివిజన్ కార్యదర్శి వెంకటేష్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని పోలీసులు సదరు సభ్యులను పట్టుకున్నారన్నారు. వారిని వెంటనే కోర్టులో హాజరు పరిచాలని పేర్కొన్నారు. వారికి ఏమైనా జరిగితే ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు.

జ్యోతిష్మతిలో అధ్యాపకులకు శిక్షణ తరగతులు


జ్యోతిష్మతిలో అధ్యాపకులకు శిక్షణ కార్యక్రమం

తిమ్మాపూర్, జూలై30: స్థానిక జ్యోతిష్మతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌స్‌లోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ ఎమర్జింగ్ టెక్నాలజీస్‌లో జ్యోతిష్మతి ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన అన్ని విభాగాల అధ్యాపకులకు మంగళవారం ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని విద్యా సంస్థల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సాగర్‌రావు మాట్లాడుతూ సాప్ ల్యాబ్ ఇండియా, తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్(టాస్క్) ఆధ్వర్యంలో కోడ్ ఉన్నతి కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ వల్ల అధ్యాపకులు తమ బోధనా పద్ధతుల్లో అభివృద్ధి చెందుతున్న సాంకేతికతను పొందుపరచడానికి అవకాశం ఉంటుందన్నారు. తాజా సాంకేతిక అంశాలను బోధించడం ద్వారా పరిశ్రమ విద్యాపరమైన అంతరాన్ని తగ్గించడానికి ప్రణాళికలు రూపొందించుకోవడానికి దోహదపడుతుందని తెలిపారు. దీనికి అనుగుణంగానే జ్యోతిష్మతిలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమానికి యంఎల్/ ఏఐ సబ్జెక్ట్ మాస్టర్ నిపుణులు పవన్‌సాయి కుందం, ఎడ్యునెట్ ఫౌండేషన్ బెంగళూర్‌కి చెందిన మాస్టర్ ట్రైనర్ సుమిత్ సునీల్ సార్తాలే శిక్షణ ఇస్తున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ, కరస్పాండెంట్ జువ్వాడి సుమిత్‌సాయి, ప్రిన్సిపాల్ ఏఎస్.రావు, డీన్ పికె.వైశాలి, విభాగధిపతి ఆర్.జగదీశన్ అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

కరీంనగర్ రూరల్, జూలై30: మండలంలోని చేగుర్తి గ్రామంలో కొందరు భూస్వాములు 12ఆర్ కెనాల్‌ను ఆక్రమించుకున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు ఎల్‌ఎండీ డీఈకి ఫిర్యాదు చేశారు. గ్రామంలోని కొందరు వ్యక్తులు మామిడి చెట్లను నాటి చుట్టూ ప్రహరీ నిర్మించుకొని ఈ రహదారి వెంబడి గ్రామస్థులను నడవకుండా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కెనాల్ కింద అనేక మంది రైతులు వ్యవసాయ భూములను సాగు చేస్తున్నారని వెంటనే విచారణ చేపట్టి రహదారిని పునరుద్ధరించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు. గ్రామానికి చెందిన ఆవుల సంజయ్, డి.రాజయ్య పి.అంజయ్య, జి.చంద్రయ్య, జీ.అంజయ్య లక్ష్మీనారాయణ, శ్రీలేఖ, జి.శ్రీనివాస్, యం.కొమురయ్య ఈ.ఆనంద్, రాజు, ఆనంద్, తదితరులు అధికారులకు విన్నవించారు.

ట్రాన్స్‌ఫార్మర్ల పరిశీలన

భగత్‌నగర్, జూలై 30: కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్ సెక్షన్ చింతకుంటలో విద్యుత్ శాఖ ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ మంగళవారం ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గర తరచు ఉడతలు, తొండలు వచ్చి ప్రమాదానికి గురై చనిపోతున్నాయన్నారు. దీనిని నివారించడానికి ట్రాన్స్‌ఫార్మర్ల హెచ్‌జి ఫ్యూజ్‌కు ప్రయోగాత్మకంగా హెచ్‌టి టేపు వేసి పరిశీలించామన్నారు. కార్యక్రమంలో డీఈ రాజం, ఏడీఈ కొలుపుల రాజు, రూరల్ విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

నియామకం

కరీంనగర్ కల్చరల్, జూలై30: స్థానిక ఫిలింభవన్‌లో మంగళవారం జరిగిన కరీంనగర్ జిల్లా సంగీత, సాంస్కృతిక కళాకారుల సంక్షేమ సంఘం ఎన్నికల్లో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా గోగుల ప్రసాద్, చిలువేరు శ్రీకాంత్, కోశాధికారిగా గౌరవేని బాబు, ప్రోగ్రాం కన్వీనర్‌గా తిప్పబత్తిని రవీందర్ గెలుపొందారు.

యువతకు ఉద్యోగాలు కల్పనకు కృషి

కరీంనగర్ అర్బన్, జూలై30: కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దఎతున యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నదని కాంగ్రెస్‌పార్టీ కరీంనగర్ పార్లమెంటు ఇంచార్జి వెలిచాల రాజేందర్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిష్ఠాత్మక తెలంగాణ స్కిల్స్ యూనివర్సిటీ బిల్లు(యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ-పబ్లిక్ ప్రయివేట్ పార్ట్‌నర్‌సిప్ బిల్ 2024)ను సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం మంగళ వారం అసెంబ్లీలో ప్రవేశపెట్టడం అభినందనీయమన్నారు.

రక్తదానం చేయాలి

సుభాష్‌నగర్, జూలై 30: యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ పెండ్యాల కేశవరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం సొసైటీలో రక్తం నిలువలు తక్కువగా ఉన్నందున టీ షాపు నిర్వాహకుడు షబ్బీర్ స్వచ్ఛందంగా రక్తదానం చేయడం అభినందనీయన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ ఎంఎల్ఎన్ రెడ్డి, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

హిందూవాహిని జిల్లా అధ్యక్షురాలిగా జ్ఞానేశ్వరి

సుభాష్‌నగర్, జూలై 30: హిందూ వాహిని సంఘటన్ మహిళామోర్చా జిల్లా అధ్యక్షురాలిగా తమ్మడి జ్ఞానేశ్వరిని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షురాలు మద్దూరి భార్గవిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన వారం దరికి జ్ఞానేశ్వరి కృతజ్ఞతలు తెలిపారు.

కరాటేలో 'బ్లూబెల్స్' విద్యార్థినికి పతకం

కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 30: హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన కరాటే పోటీల్లో పాల్గొన్న బ్లూబెల్స్ పాఠశాల విద్యార్థిని కొర్ర శ్రీహిత రజిత పతకం సాధించింది. పాఠశాల ప్రిన్సిపాల్ గంగా సునీతా మనోహర్‌రెడ్డి ఆమెకు ప్రశంసాపత్రాన్ని, పతకాలను అందించి అభినందించారు.

● సంక్షిప్త సమాచారం..

హుజూరాబాద్, జూలై 30: హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా లో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులకు వేతనాలు పెంచడాన్ని హర్షిస్తూ మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల చిత్రపటాలకు కళాకారులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో అనిల్‌కు మార్, బబ్లీ, రహీం, రాజు, సురేష్, శ్రావణ్‌కుమార్, శ్రీధర్, వెంకన్న, నిజాముద్దీన్, తిరుపతి, పద్మ పాల్గొన్నారు.

●ఇల్లందకుంట: ఇల్లందకుంట మండలం టేకుర్తి గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. వైద్యాధికారి డాక్టర్ తులసీదాస్ పాల్గొన్నారు.

●రామడుగు: మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం రెండో విడుత రుణమాఫీ చేస్తున్న సందర్భంగా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఏవో యాస్మిన్, ఎంపీడీవో రాజేశ్వరి పాల్గొన్నారు.

● గన్నేరువరం: మండలంలోని జంగపల్లి గ్రామ శివారులోని పెద్దమ్మతల్లి ఆలయం వద్ద ఉన్న గుట్టను గ్రామానికి చెందిన అనుమాండ్ల శ్రీనివాస్, కొంకటి ప్రశాంత్‌లు అక్రమంగా జేసీబీతో తవ్వి మట్టిని టిప్పర్ల ద్వారా తరలించి స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని అదే గ్రామానికి చెందిన అటికం రామచంద్రం, బొమ్మడి సురేందర్‌లు తవ్వకాన్ని అడ్డుకున్నారు.

● శంకరపట్నం: ప్రభుత్వం విడుదల చేసిన రెండో విడత లక్షన్నర లోపు రుణమాఫీ జాబితాలలో పేర్లు రాలేదని కొంత మంది రైతులు మంగళవారం వ్యవసా యాధికారులకు దరఖాస్తు అందజేశారు.

● ఇల్లందకుంట: మండలంలోని కనగర్తి గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమాన్ని తహసీల్దార్ రాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద పౌరహక్కుల దినోత్సవం నిర్వహించడం సరికాదన్నారు. జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

● సైదాపూర్: మండలంలోని వెన్నంపల్లి విశాల సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సైదాపూర్, వెన్నంపల్లి గ్రామాల్లో సంఘం అధ్యక్షుడు కొత్త తిరుపతిరెడ్డి, జిల్లా సహకార అధికారి రామానుజచార్యులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీనియర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సంఘం సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

● చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ ప్రభుత్వ పాఠశాలకు పది వేల విలువ గల ఆరు సీలింగ్ ఫ్యాన్లను చొప్పదండి లయన్స్ క్లబ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మంగళవారం అందజేసింది. ఈ కార్యక్రమంలో క్లబ్ చైర్మెన్ మహేశుని మల్లేశం,ఎంఎల్ఎన్ రెడ్డి,మోర భద్రేశం,రాజేశ్ పవార్.సత్యనారాయణ,లక్ష్మీనారాయణ,మాదూరి శ్రీనివాస్, వల్లాల కృష్ణహరి,ప్రధానోపాధ్యాయుడు రఘుకిశోర్‌రెడ్డి ఉన్నారు.

● రామడుగు: గోపాల్‌రావుపేటలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గట్టమనేని బాబురావు ఇంటర్నేషనల్ డైరెక్టర్ జన్మదినం సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షులు కర్ర ప్రభాకరొరెడ్డి, ఉపాధ్యక్షులు కర్ర రాజిరెడ్డి పాల్గొన్నారు.

● జమ్మికుంట రూరల్: పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో నెలకొన్న వరద కాల్వ సమస్యను మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకువెళ్లాలని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ వొడితల ప్రణవ్‌బాబుకు కౌన్సిలర్ శ్రీపతి నరేష్ వినతిపత్రం అందజేశారు.

● వీణవంక: మండలంలోని గ్రామ పంచాయతీ కార్మికుల చలో హైద్రాబాద్ పిలుపు మేరకు ముందస్తుగా కార్మికులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

● శంకరపట్నం: కేశవపట్నం పోలీసులు గ్రామ పంచాయతీ సిబ్బంది చలో హైద్రాబాద్ కార్యక్రమానికి వెళ్లకుండా అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.